క్లుప్తంగా

క్వారీ లీజ్ రద్దు చేయండి

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న ఆత్యం మైనింగ్ క్వారీ లీజ్‌ను రద్దు చేయాలని కూటమి నాయకులు అక్కేన మధుసూదనరావు, మరడాన తవిటినాయుడు, అక్కేన శంకరరావు, పాలూరి రవిబాబు తదితరులు కోరుతున్నారు. శనివారం క్వారీ ప్రాంతాన్ని వారు పరిశీలించి, క్వారీలో జరుగుతున్న పనులపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని, అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే తక్షణమే క్వారీ లైసెన్స్ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్‌పై చర్చ


సమావేశానికి హాజరైన ఎంపీపీ సురేష్, ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ బడ్జెట్‌పై శనివారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన ఎంపీడీవో ఎస్.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై సభ్యులు చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జి.సంపత్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన


అన్నసమారాధన చేస్తున్న భక్తులు

పాలకొండ: పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా భక్తుల విరాళాలతో సుమారు ఐదువేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకుడు గాసీదాస్, తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం


స్వామి దర్శనానికి క్యూలైన్‌లో నిల్చొన్న భక్తులు


గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తజనం పోటెత్తారు. శనివారం వేకువజాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామిని మనసారా దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, శాత్తుముర్రై, తీర్థఘోష్టి, బాలభోగం, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పించన్ పాట్లు..


కిల్లాడ సరిహద్దు వద్ద పించన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

సీతంపేట: సెల్ సిగ్నల్స్ అందకపోవడంతో సీతంపేట ఏజెన్సీలో కొన్ని గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొండాడ పంచాయతీ పరిధి జేపీలాడ, పెద్దగూడ, వలసగూడ, జలుబుగూడ గ్రామాల్లో శనివారం పింఛన్ల పంపిణీలో ఇబ్బందులేర్పడ్డాయి. దీంతో దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిల్లాడ సరిహద్దు వరకు పింఛన్‌దారులు నడుచుకుంటూ వచ్చి పింఛన్ తీసుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరం..



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

వీరఘట్టం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా వీరఘట్టం రెల్లివీధిలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించినా, తరలించినా చర్యలు తప్పవన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు ఎస్సై జి.కళాధర్, పోలీస్ సిబ్బంది, వీఆర్‌ఓ అప్పలనాయుడు, తదితరులున్నారు.


లుంబూరు సమీపంలో కోతలు పూర్తయిన వరి మడిలో చేరిన వర్షపునీరు


మల్లివీడు వద్ద వరికుప్పలు వేస్తున్న రైతులు

అన్నదాతల్లో ఫెంగల్ వణుకు

- పూర్తయిన వరి కోతలు
- మబ్బుపట్టిన వాతావరణంతో గుబులు
- పంట కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను అన్నదాతల్లో వణుకు పుట్టిస్తోంది. గడిచిన రెండు రోజులుగా వాతావరణం మబ్బులు పట్టడంతో పాటు మోస్తారు వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం చిరుజల్లు కురవడంతో పాటు చల్లని గాలులు వీయడంతో ఏ క్షణమైనా వర్షం కురుస్తుందని భావించిన రైతులు పొలంబాట పట్టారు. మండల పరిధిలో ఏ గ్రామ సమీపంలో చూసినా కర్షకులు తమ పంటను దక్కించుకునే ప్రయత్నంలో బిజీగా ఉన్నారు. ఇప్పటికే కోత కోసం పొలంలో ఆరబోసిన చేలు తాజా వర్షానికి తడిసిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వరి కుప్పలు, ఓవులను దక్కించుకునేందుకు కుటుంబాలతో సహా రైతులు పొలాల్లో గడిపారు. కుప్పలు తడవకుండా టార్పాలిన్లు కప్పడం, వీలైనంతవరకు యంత్రాల సహాయంతో నూర్పిళ్లు చేపట్టి ధాన్యం భద్రపరుచుకునే పనిలో పడ్డారు. మరోవైపు వాతావరణ శాఖాధికారులు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాపై తుపాను ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తుండటంతో రైతులు మరింత గుబులు చెందుతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా వరి కోతలు పూర్తి చేసుకుని పెసర, మినప, శనగ, కూరగాయలు సాగు చేస్తున్న వారికి ఈ వర్షం మేలు చేయనుంది.


ఎం.సింగుపురం సమీపంలో కోత పూర్తి చేసిన చేను కట్టలు కడుతున్న వేతనదారులు

ఎన్నికలపై అవగాహన కల్పించండి..

భామిని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల విషయాలని ప్రజలందరికీ తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ నీలాపు అప్పారావును శనివారం కలిశారు. మండలంలోని 25 నీటి సంఘాల ఓటర్ల జాబితాలను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అందించాలని కోరారు. దీనికి తహసీల్దార్ అప్పారావు స్పందిస్తూ ఎన్నికలు నీటిపారుదల ఏఈ ఆర్.మధు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో వలరౌతు శ్రీనివాసరావు, కార్యకర్తలున్నారు.


తహసీల్దార్ అప్పారావుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి..

- డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు

వీరఘట్టం: సమగ్ర వ్యవసాయం ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ పీడీ వై. సత్యంనాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. మండంలోని చలివేంద్రిలో డ్వాకా సంఘ సభ్యులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్ట్‌ల ద్వారా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులు పండించే పంటలకు అధిక ఆదాయం వచ్చేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు జి.శివున్నాయుడు, కెల్ల రాము, భారతి, సీసీ ఆనందరావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు

వినతిపత్రం అందజేత

జియ్యమ్మవలస: ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో ఎంటీఎస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ వారంతా మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ మనోజ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్ల వయసు పైబడి ఉండడంతో పాటు బీపీ, సుగర్‌లతో బాధపడుతున్నందున ఆ పనిభారం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కొద్దిపాటి జీతంతో కుటుంబ పోషణను నెట్టుకొస్తున్న తమకు కనీసం టీఏ, డీఏ, హెచ్‌ఆర్‌ఏ సదుపాయాలు కూడా లేవని, ఇలాంటి నేపథ్యంలో తమకు ఆ పని అప్పగిస్తే ఆర్థికంగా మరింత కుంగిపోతామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వేణుగోపాల్, ఉపాధ్యాయులు బాలాజీ, కె.లక్ష్మి, ఎంటీఎస్ ఉపాధ్యాయులు కె.అప్పలనాయుడు, టి.గౌరీశంకరరావు, జి.వెంకటరమణ, జి.జగదీశ్వరి, బి.స్వాతి, పి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

గోశాల నిర్మాణాలు వేగవంతం

భామిని: ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న గోశాలల నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాలని ఉపాధి ఏపీఓ ఈ.తులసీదాస్ అన్నారు. మండలంలోని పసుకుడి, బిల్లుమడ, మనుమకొండలలో నిర్మిస్తున్న గోశాలలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 12 గోశాలలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.రవినాయుడు, ఉపాధి టీఏ పి.రాంబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ



గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ, మానవహారం శనివారం నిర్వహించారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వ్యాధి ఎలా సంభవిస్తుంది.. దానికి కారణమైన హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్)పై వివరించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి ద్వారా వైరస్ సోకుతుందని, హెచ్‌ఐవీ వ్యాప్తి నిర్మూలనకు మనవంతు కృషి చేయాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు కల్పన, స్వరూప, తులసి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

–గుమ్మలక్ష్మీపురం

అపరాల పంటలు సాగు చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: రబీ సీజన్‌లో అపరాల పంటలు సాగు చేసుకోవాలని ఏవో సీహెచ్ ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని డోకులగూడ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలను ఆయన శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎప్పుడూ ఒకే పంట పండించకుండా పంటలను మారుస్తూ ఉండాలని, అలాంటప్పుడే నేల సారం పెరుగుతుందన్నారు. పంటపొలంలో నిత్యం ఏదో ఒక పంట పండేలా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి కె.భూషణరావు తదితరులు ఉన్నారు.

పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మల వెంకటరావును మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి శనివారం పరామర్శించారు. ఆయన తండ్రి ఇటీవల మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న ఆమె మండలంలోని ధర్మలక్ష్మీపురంలో ఉన్న ఆయన స్వగృహానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సుజాత, పార్టీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు తదితరులు ఉన్నారు.

హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం


సిబ్బందికి సూచనలిస్తున్న స్పెషలాఫీసర్ గియాజుద్దిన్

సీతంపేట: హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి మహ్మద్ గియాజుద్దిన్ అన్నారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్‌పీసీఐ వేగవంతం చేయాలన్నారు. అలాగే నీటి నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడి భోజనాన్ని రుచిచూశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

పాలకొండ రూరల్: శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడంతో పాటు మెరుగైన ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా సాదన చేయాలని శిక్షకుడు జనార్ధనరావు అన్నారు. శనివారం స్థానిక రుషీ యోగాకేంద్రం వద్ద సాధకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాంత్రిక, సాంకేతిక జీవనంలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఒక్కటే మార్గమన్నారు. అనంతరం సూర్య నమస్కారాలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.


యోగాసనాలు వేస్తున్న సాధకులు

విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం..

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



వీరఘట్టం: ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి విచ్చన తర్వాత చార్జీలు పెంచడం దారుణమని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలోకి తొక్కుతోందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండలంలోని వండువలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాల హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన మార్కు రాజకీయం చేస్తూ ప్రజలను మరోసారి మోసగించారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బాబు చెప్పిన ష్యూరిటీ ఏమోగాని బాదుడు గ్యారంటీ అన్నట్లుగా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని పదే పదే ప్రజలను నమ్మించి తీరా అధికారంలోకి వచ్చాక బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టడం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలి

- న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని బద్దుమాసింగి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలు, రికార్డుల నిర్వహణ, వసతిగృహంలో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సమయంలో విద్యార్థినులు మాట్లాడుతూ, పూర్తి స్థాయిలో వసతి లేదని తెలియజేశారు. అలాగే ఏఎన్‌ఎం లేక ఆరోగ్య సమస్యలు వచ్చే సమయంలో ఏర్పడుతున్న ఇబ్బందులు న్యాయమూర్తికి వివరించారు. సమస్యల పరిష్కారానికి న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎంపీఎస్ చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధన్యం..

రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు జైలు అధికారులు అధిక ప్రాధాన్యం కల్పించాలని న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. పాలకొండ సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి ఖైదీలతో మాట్లాడారు. న్యాయపరమైన సేవలు అందుతున్నాయా.. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నదీ, లేనిదీ ఆరా తావారు. ఈయన వెంట న్యాయ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, డీపీటీ నాయుడు, జైలు వార్డర్స్ హేమసుందర్, నాగరాజు తదిరులున్నారు.


ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పథకాల అమలులో విఫలం

సీతంపేట: పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మండలంలోని దారపాడు పంచాయతీ కోసంగిలో సీపీఎం 12వ మహాసభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులు, చట్టాలు, జీఓలను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అనంతరం నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శిగా ఎ.భాస్కరరావు, సభ్యులుగా జె.శ్రీరాములు, సుందరమ్మ, మధుసూదన్, ఎం.లక్ష్మణరావు, ఎం.కాంతారావు, పి.వీరన్న, ఎం.వెంకటేష్, బి.పరశురాం, పి.సాంబయ్య, ఆరిక ధనలక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.తిరుపతిరావు, గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వేణు

పోలిపాడ్యమి వేడుకలకు ఏర్పాట్లు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం అర్ధరాత్రి నుంచి నిర్వహించనున్న పోలిపాడ్యమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పవిత్ర కార్తీకమాసం ముగింపు సందర్భంగా నాగావళి నదికి పుణ్యహారతులు ఇచ్చేందుకు, పలు పూజలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. భక్తుల పవిత్ర స్నానాలకు, దుస్తులు మార్చుకునేందుకు, తాగునీటికి సదుపాయాలు కల్పిస్తున్నారు. శనివారం ఆయా పనులను ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ పరిశీలించి, పలు సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

వసతిగృహం తనిఖీ..

వీరఘట్టం మండలంలోని గంగమ్మపేట గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు వీరఘట్టం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పాలకొండ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గంగమ్మపేట ఆశ్రమ పాఠశాల సమీపంలోని పాడుపడిన భవనాన్ని తొలగించాలని విద్యార్థులు కోరారు. ఆయనతో పాటు అడ్వకేట్ ఎం.వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

– వీరఘట్టం



ప్రోగ్రస్‌కార్డులు వచ్చేశాయ్..

డిసెంబర్ 7న నిర్వహించనున్న మెగా పేరెంట్, టీచర్ డే రోజున విద్యార్థులకు ఇవ్వనున్న ప్రోగ్రస్ కార్డులు మండలానికి చేరుకున్నాయి. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రస్తుతం ఈ కార్డులు సిద్ధంగా ఉన్నాయి. వీటిని రెండో తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ ఆర్. ఆనందరావు తెలిపారు.

– వీరఘట్టం



వినూత్న నిరసన..

గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు శనివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఐటీడీఏ ముఖద్వారం వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలో కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సంఘ నాయకులు బి.గణేష్, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.


–సీతంపేట